క్లుప్తంగా

మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీ డీకే అరుణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: రాష్ట్రంలోని రైస్‌మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలని శనివారం హైదరాబాద్‌లో కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను బీజేపీ ఎల్లారెడ్డిపేట మండల నాయకులు కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. నాయకులు చందుపట్ల రాజిరెడ్డి, మానుక కుమార్‌యాదవ్, వంగల శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

ఏకలవ్య జయంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో తమ కులదైవం ఏకలవ్య జయంతిని సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకుని ముందుకు పోవాలన్నారు. నాయకులు కోనేటి పోచయ్య, కోనేటి నరేశ్, మల్లయ్య, సాయిలు, ఉప్పలయ్య, రాములు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

బోయినపల్లి: మిడ్‌మానేరు ప్రాజెక్టులో ముంపునకు గురైన మండలంలోని వరదవెల్లి గ్రామ నిర్వాసితుల పెండింగ్ సమస్యలపై శనివారం తహసీల్దార్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. నిర్వాసితులు తమకు రావాల్సిన వివిధ రకాల పరిహారాలు, సమస్యలపై వినతిపత్రాలు అందించారు. 111 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. పైఅధికారులకు సమస్యలపై నివేదిక అందచేస్తామని పేర్కొన్నారు. ఆర్‌ఐ మనోజ్ తదితరులు ఉన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

కోనరావుపేట: పాండిచ్చేరి మొట్టమొదటి లెఫ్టినెంట్ గవర్నర్ శీలం లక్ష్మణ్ 45 వర్ధంతి సందర్భంగా శనివారం మండలకేంద్రంలోని మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, మండల అధ్యక్షుడు కచ్చకాయల బాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వేల్పుల తిరుపతి, నాయకులు వేల్పుల మహిపాల్, ఆరె తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చందుర్తి: మండలకేంద్రంలోని రైతు వేదికలో శనివారం బీఎల్‌వోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ శ్రీధర్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించి స్థానిక ఎన్నికల దృష్ట్యా నూతన ఓటర్ల పేరు నమోదు, ఓటరు జాబితాలో పేర్ల తొలగింపు, మార్పులు, చేర్పులపై అవగాహన కల్పించారు. ఆర్‌ఐలు శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10వేల వేతనం ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న కార్మికులు

ఎల్లారెడ్డిపేట: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం అమలు చేయాలని ఆ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మీసం లక్ష్మణ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎలగేటి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట శనివారం ఆందోళన చేశారు. ఈనెల 9న ఆలిండియా కార్మిక సంఘాల పిలుపుతో మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నోటీసును మండల విద్యాధికారి కృష్ణహరికి అందజేశారు. కార్మికులు లత, లక్ష్మి, నర్సవ్వ, కొమురవ్వ, భాగ్య, నిర్మల, మణెమ్మ, రజిత, లావణ్య, రోజా పాల్గొన్నారు.

వెచ్చగా.. నచ్చేలా

- క్యూట్ రెయిన్ కోట్స్‌కు క్రేజ్
- బ్రాండెడ్.. అన్‌బ్రాండెడ్‌లో లభ్యం

సండే స్పెషల్

సిరిసిల్లటౌన్: వర్షంలో బయట పనులు చేసే వారికోసం మార్కెట్‌లో మాన్‌సూట్స్ క్యూట్‌గా దర్శనమిస్తున్నాయి. విధి నిర్వహణలో ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, కర్షకులు వర్షానికి తడుస్తూ వెళ్లాల్సి వస్తుంది. ఇటువంటి వారికోసం మాన్‌సూట్స్ మార్కెట్లో సందడి చేస్తున్నాయి. అదిరే గెటప్‌తో కనిపించే మాన్‌సూట్‌లకు పట్టణంలో క్రేజ్ ఉంది. అన్నివర్గాల వారు ఆదరిస్తున్న మాన్ సూట్‌లపై కథనం.



లేటెస్ట్' డిజైన్స్

స్టైలిష్‌గా తయారయ్యే అలంకార ప్రియులను మెప్పించడానికి మార్కెట్లో లేటెస్ట్ డిజైన్లలో మాన్‌సూట్స్ ఉన్నాయి. రంగురంగుల డిజైన్లలో సిరిసిల్లలోని షోరూంలు, స్ట్రీట్ వెండర్స్ వివిధ రకాల రెయిన్‌సూట్లు విక్రయిస్తున్నారు. బ్రాండెడ్‌లో రీబాక్, లీ, ఫ్లయింగ్‌మిషన్, కాపస్‌టోన్, వుడ్‌ల్యాండ్, నైక్, ఆడ్‌లైఫ్, జరా వంటి బ్రాండెడ్ కంపెనీలతో సహా అన్‌బ్రాండెడ్‌లో కూడా అనేక రకాలున్నాయి. జిల్లా కేంద్రంలోని పెద్దబజారు, గాంధీచౌక్, మున్సిపల్‌రోడ్, పాతబస్టాండ్, వెంకంపేట, కొత్తబస్టాండ్, మార్కెట్, బీవైనగర్ ప్రాంతాల్లోని షాపుల్లో సూట్లను విక్రయిస్తున్నారు.

మనసుకు నచ్చేలా..





- వర్షాకాలంలో ఈదర నుంచి కాపాడేందుకు తొడిగితే వెచ్చగా.. చూడటానికి మనస్సు నచ్చేలా మాన్‌సూట్స్ ఆకట్టుకుంటున్నాయి. వెరైటీ డిజైన్లలో ఉండే మాన్‌సూట్స్ అన్ని వర్గాలవారి వినియోగంతో వాటికి యమా క్రేజ్ వచ్చింది. స్కూల్‌కు వెళ్లే పిల్లలు, ఆఫీసులకు వెళ్లే పెద్దలు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ తప్పనిసరిగా వర్షంలో బయటకు పోవడానికి రెయిన్ కోట్స్ తప్పనిసరి అంటున్నారు. ద్విచక్రవాహనాలపై వెళ్లే వారికి గొడుగులను వినియోగించడం కొంత కష్టమైన పనే. వీరంతా సులభంగా ధరించే లేటెస్ట్ రేయిన్‌సూట్లను కోరుకుంటున్నారు. వీటిని ధరిస్తే వర్షంలో తడవకుండా రక్షణ ఇస్తాయి. చూసేవారికి ఆకట్టుకునే గెటప్‌లో కనిపించడంతో అన్నివర్గాల వారి వినియోగంతో మాన్‌సూన్ సూట్లకు క్రేజ్ పెరిగింది.

అందుబాటు ధరల్లో..

మార్కెట్‌లో అందమైన మాన్‌సూట్స్ అన్నివర్గాల వారికి అందుబాటు ధరల్లో ఉన్నాయి. రెయిన్‌ప్యాంట్, షర్ట్, జాకెట్, లాంగ్‌జాకెట్, టూ ఇన్ వన్ జాకెట్, లెదర్ జాకెట్, రెగ్జిన్‌బ్యాక్ గ్రౌండ్‌తో సూట్లు తయారవుతున్నాయి. వీటిని వ్యాపారులు హైదరాబాద్, ముంబయి, ఢిల్లీ, బెంగుళూరు నుంచి తెప్పిస్తున్నారు. బ్రాండెడ్‌లో రూ.1,200 నుంచి రూ.10,000 వరకు.. అన్‌బ్రాండెడ్‌లో రూ.200 నుంచి రూ.1,000 లోపు ధరలున్నాయి.

ట్రెండ్‌కు తగ్గట్టు డిజైన్లు



నేటి ట్రెండ్‌కు తగ్గట్లుగా అన్ని బ్రాండెడ్‌లో సూట్లను తెప్పించాం. హైదరాబాద్ వంటి నగరాల ధరల్లోనే స్థానికంగా అందిస్తున్నాం. ఎక్కువగా ఇండి విజ్యువల్‌గా ఉండే రెయిన్ కోట్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. స్టైలిష్‌గా ఉండే బ్రాండెడ్ మాన్‌సూట్స్‌ను యూత్ ఇష్టపడుతున్నారు. కస్టమర్లు మెచ్చే మోడల్స్‌లో మాన్‌సూట్స్ తెప్పించాం..

– రాజూరి వంశీ, వ్యాపారి, సిరిసిల్ల

వర్షంలో కంఫర్ట్‌గా..



మాన్‌సూట్ ధరిస్తే కంఫర్ట్‌గా ఉంటుంది. ప్రైవేటు ఉద్యోగులు తప్పనిసరి పరిస్థితుల్లో వర్షంలో బయటకు వెళ్లాల్సి ఉంటుంది. శరీరానికి రక్షణతో పాటు తడవకుండా రెయిన్ కోటు సౌకర్యంగా ఉంటుంది. బ్రాండెడ్, అన్‌బ్రాండెడ్ మాన్‌సూట్స్ అందుబాటు ధరల్లోనే విక్రయిస్తున్నారు.

– చిమ్మని రవీందర్, ప్రైవేటు ఉద్యోగి, సిరిసిల్ల

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ తోడ్పాటు



మొక్కలు నాటే కార్యక్రమంలో అధికారులు

గంభీరావుపేట: ఆయిల్‌పామ్ సాగు కోసం ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి లత పేర్కొన్నారు. గంభీరావుపేట మండలం లింగన్నపేటలో శనివారం ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లాలో 2,102 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోందని, ఇప్పటి వరకు గంభీరావుపేట మండలంలో 128 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మరో 2వేల ఎకరాలు లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. నర్సరీలో ఒక్కో ఆయిల్ మొక్క రూ.193 ఉండగా.. రైతులకు రూ.20కు అందిస్తున్నామన్నారు. పంట నిర్వహణ ఖర్చుల కోసం ఎకరాకు రూ.4,200 చొప్పున నాలుగేళ్లపాటు అందిస్తామని వివరించారు. వేములవాడ డివిజన్ అధికారి లోకేశ్, వ్యవసాయాధికారులు సాయితేజ, ప్రవీణ్, ప్రీ యూనిక్ మేనేజర్ ప్రేమ్‌సాయిరెడ్డి, ఆఫీసర్ హరీశ్, రైతులు కమలాకర్‌రెడ్డి, రంగారావు పాల్గొన్నారు.

ఆర్థిక అభ్యున్నతి పథకాలపై అవగాహన

రుద్రంగి: పీఎం ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్, జన భగీధరీ అభియాన్ పథకాలపై రుద్రంగి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. మానాల, బడితండా, సర్పంచ్‌తండా, చింతామనితండా, గైదిగుట్టతండా గిరిజనులకు బడితండాలో అవగాహన కల్పించారు. ఆధార్‌కార్డు, కులసర్టిఫికెట్స్, జన్‌ధన్ బ్యాంకు అకౌంట్‌లు తీసుకోవాలని సూచించారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి భారతి, సీడీపీవో, గిరిజన అభివృద్ధి అధికారి సంగీత, రుద్రంగి తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో నటరాజ్ పాల్గొన్నారు.

ఫారెస్ట్ భూమి సర్వేకు ప్రతిపాదనలు



పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

ఇల్లంతకుంట: అనంతారం ఫారెస్ట్ భూముల సర్వే కోసం హైదరాబాద్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ సర్వే అండ్ ల్యాండ్స్‌కు ప్రతిపాదనలు పంపినట్టు సిరిసిల్ల ఫారెస్ట్ రేంజర్ శ్రీహరి ప్రసాద్ తెలిపారు. మండలంలోని అనంతారం గ్రామంలో మూడవ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో శనివారం భూమి చదును చేస్తుండగా సిబ్బందితో పర్యవేక్షించారు. అటవీ భూముల్లో చెట్ల పెంపకానికి చదును చేస్తుంటే, రైతులు తమ భూమి అని రావడం సరికాదని, సర్వే నంబర్ల ప్రకారం వారి భూమి ఎక్కడ ఉందో సరి చూసుకోవాలన్నారు. అనంతారం మూడవ రిజర్వ్ ఫారెస్ట్ సర్వేనంబర్ 565లో 292 ఎకరాల భూమి ఉందని వివరించారు. పక్షం రోజుల్లో ఏడీఎస్‌ఎల్ఆర్ సాయంతో భూ సర్వే నిర్వహిస్తామని, అప్పుడు అటవీ, రైతుల భూముల సర్వే నంబర్లు తెలుస్తాయని పేర్కొన్నారు.

పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న అధికారులు

కోనరావుపేట/వేములవాడరూరల్/వేములవాడఅర్బన్/తంగళ్లపల్లి: కోనరావుపేట మండలకేంద్రంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. సంఘం ఆవరణలో మొక్కలు నాటారు. చైర్మన్ బండ నర్సయ్యయాదవ్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. వేములవాడరూరల్ మండలం చెక్కపల్లిలో సొసైటీ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని గోదాం వద్ద మొక్కలు నాటారు. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి పీఏసీఎస్ చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. డీసీవో రామకృష్ణ, సూపరింటెండెంట్ రమ తదితరులు పాల్గొన్నారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శుభోదయం ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులు గ్రీన్‌డే నిర్వహించి మొక్కలు నాటారు. కరస్పాండెంట్ శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు హుండీ లెక్కింపు

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకుని స్వామివారి హుండీలలో వేసిన కట్నాలు, కానుకలను ఈనెల 7న స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో లెక్కించనున్నట్లు ఆలయ ఈవో రాధాబాయి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు.

యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా దేవేందర్



దేవేందర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం సంఘ కార్యాలయంలో ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గండిలచ్చపేటకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బండి దేవేందర్‌యాదవ్ తన సమీప అభ్యర్థి మాసం భాస్కర్‌పై 8 ఓట్ల తేడాతో విజయం సాధించారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బైండ్ల సంఘం కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

కోనరావుపేట: బైండ్ల సంఘం మండల అధ్యక్షుడిగా గొట్టె లక్ష్మణ్ ఎన్నికయ్యారు. శనివారం సంఘ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కొట్టె జనార్దన్, కోశాధికారి గొట్టె రవి, కార్యదర్శి గొట్టె దయాకర్, గొట్టె మనోజ్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని బీజేపీ నాయకుడు గొట్టె రామచంద్రం అభినందించారు.

ఎస్సైని కలిసిన మున్నూరు కాపు సంఘం నాయకులు

గంభీరావుపేట: గంభీరావుపేట ఎస్సై రమాకాంత్‌ను మున్నూరుకాపు సంఘం మండల నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండల అధ్యక్షుడు కూర సురేశ్, నాయకులు పల్లె శ్రీనివాస్, వేశాల రమేశ్, రాజు, శంకర్, దేవయ్య, రాజయ్య ఉన్నారు.



గంభీరావుపేట: మండలకేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన మూత్రశాలలు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిలోనికి వెళ్లడానికి వీల్లేకుండా ఉంది. కనీసం మెట్లు కూడా ఏర్పాటు చేయలేదు. కొన్నింటి తాళాలు కూడా తీయకపోగా, నీటి సరఫరా కోసం చర్యలు తీసుకోలేదు. రైతువేదికలో అధికారులు ఎన్నో సమావేశాలు నిర్వహిస్తున్నారు. సమావేశాలకు వచ్చే రైతులు, అధికారులు, మహిళలు 'బాధ' చెప్పుకోలేకపోతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
సలావుద్దీన్, మండల వ్యవసాయాధికారి, గంభీరావుపేట: 89777 55283

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

అరవైఐదు కోడెలతో రాజన్నకు మొక్కు



మొక్కు చెల్లించుకుంటున్న బీజేపీ నాయకులు

వేములవాడ: బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ జన్మదినం పురస్కరించుకుని ఆపార్టీ నాయకులు శనివారం రాజన్నకు 65 కోడెలతో మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో 65 కేజీల కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. 65 మందితో ఏరియా ఆసుపత్రిలో రక్తదానం, 300 మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. నాయకులు రాపెల్లి శ్రీధర్, కుమ్మరి శంకర్, గోపు బాలరాజు, నామాల శేఖర్, బండ మల్లేశం, మల్లికార్జున్, కిష్టస్వామి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణమున్నంత వరకు ప్రజాసేవ..

తన ప్రాణమున్నంత వరకు ప్రజాసేవ చేస్తానని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. తన జన్మదినం సందర్భంగా చేపట్టిన ప్రజాసేవ కార్యక్రమాల అనంతరం మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలతో ఈప్రాంత అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

గంభీరావుపేట: పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని శనివారం మండలకేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా విద్యారంగంలో మార్పురాలేదన్నారు. నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేకపోతున్నారని, ఉన్నత చదువుల కోసం కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు సర్టిఫికెట్లు కావాలని ఇబ్బందులు పెట్టే కళాశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు కల్యాణ్‌కుమార్, మండల కన్వీనర్ సాయిచరణ్, నాయకులు రాజు, భరత్, తేజ తదితరులు పాల్గొన్నారు.

పీరీల ఊరేగింపు



పీరీల ఊరేగింపులో మజీద్ కమిటీ సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారంలో మొహర్రం వేడుకల్లో భాగంగా ఎనిమిది రోజులుగా పీరీల మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. శనివారం గ్రామంలోని మసీదులో గల పీరీలను ఊరేగింపుగా మొదటిసారి సమీపంలోని దర్గావళి దర్గా గుట్ట వరకు తీసుకెళ్లారు. దర్గాలో పీరీలను ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పీరీలను తిరిగి మసీదులోకి చేర్చారు. కార్యక్రమంలో మజీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండల కేంద్రంతో పాటు జంగారెడ్డిపల్లె, అనంతారం, రహీంఖాన్ పేట, ముస్కానిపేట, గాలిపెల్లి తదితర గ్రామాల్లో శనివారం రాత్రి మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం పీరీలు నిమజ్జనం కానున్నాయి.

పునశ్చరణ తరగతులతో మెరుగైన వైద్యసేవలు



జిల్లా 108 సిబ్బందితో జనార్దన్

సిరిసిల్లటౌన్: అత్యవసర పరిస్థితుల్లో ఉన్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు 108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ పేర్కొన్నారు. వారంపాటు కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయంలో జిల్లాకు చెందిన 108 సిబ్బందికి పునశ్చరణ తరగతులు నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులను రక్షించేందుకు ఈ తరగతులు ఉపయోగపడతాయన్నారు. జిల్లా మేనేజర్ అరుణ్‌కుమార్, ట్రెయినర్స్ మహేశ్, గజేందర్, 108 పైలట్స్ పెద్ది శ్రీనివాస్, పరిగె లక్ష్మణ్, గసికంటి చాణక్య, కొమిరిశెట్టి సతీశ్ కుమార్, నాగరాజు, బాబు, రాజశేఖర్, అనిల్, ఈఎంటీలు ప్రవీణ్, గుగులోతు శ్రీకాంత్, సూర శ్రీకాంత్, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా గ్రీన్ ఇండియా

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని శ్రీచైతన్య స్కూల్‌లో శనివారం గ్రీన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఎస్సై రాహుల్‌రెడ్డి మొక్కను నాటారు. ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, ఏజీఎం ముద్రకోల రాజు, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ నూరి, డీన్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

గంభీరావుపేట/బోయినపల్లి: ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో శనివారం పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు అనమేని రాజు పాల్గొన్నారు. అలాగే బోయినపల్లి మండలం కోరేంలో మాదాడి భాగ్యమ్మకు మంజూరైన రూ.60 వేల చెక్కును మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి అందజేశారు.

మట్టి తవ్వకం నిలిపివేత

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లిలో అనుమతి లేకుండా అక్రమంగా జరుగుతున్న మట్టి తవ్వకాన్ని శనివారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు.

బండ తరలింపును ఆపాలి

ఇల్లంతకుంట: మండలంలోని దాచారం గ్రామంలో శనివారం దేవునిగుట్టను కొందరు పగలగొడుతుంటే గ్రామస్తులు అభ్యంతరం చెప్పారు. ఆ దారి గుండా ఓ మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తుండగా బండకు పెట్టిన తూటాలు పేలి చిన్నచిన్న రాళ్లు శవయాత్రలో పాల్గొన్న వారిపై పడ్డాయి. విషయాన్ని ఆర్‌ఐ సంతోష్‌కుమార్‌కు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్థలానికి చేరుకునే లోపే పారిపోయారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు మారవేణి శ్రీశైలం, మల్లేశం తదితరులు కోరారు.

బహ్రెయిన్‌లో బోనాల పండుగ





గంభీరావుపేట: తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో బహ్రెయిన్‌లో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన అభిలాష్ పాటలు ఆకట్టుకున్నాయి. సమితి అధ్యక్షుడు జగదీశ్, రాజ్‌కుమార్, ప్రసాద్, శ్రీనివాస్, లత, గంగసాయి, సంతోష్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.